క్లుప్తంగా

చాతుర్మాస యజ్ఞం ప్రారంభం



యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

కేశంపేట: తొలి ఏకదశిని పురస్కరించుకొని మండలంలోని శివ సీతారామాంజనేయ ఆలయంలో గురువారం చాతుర్మాస యజ్ఞం నిర్వహించారు. ఈ యజ్ఞం కార్తీక శుద్ధ ద్వాదశి వరకు సుమారుగా 5నెలల పాటు నిర్వహిస్తామని సర్పంచ్ తలసాని వెంకట్‌రెడ్డి తెలిపారు. గ్రామస్తులతో పాటు సమీప గ్రామాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో తలసాని పద్మ, రాఘవశర్మ, విజయరెడ్డి, నర్సింహచారి, మల్లారెడ్డి, రంగారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అనసూయ, రామకృష్ణచారి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న శ్రీశైలం

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండలంలోని మొగిలిగిద్దలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీఆంజనేయస్వామి దేవాలయం నిర్మాణానికి గురువారం నడికూడ శ్రీశైలం విరాళం అందజేశారు. ఈ సందర్భంగా రూ31వేల నగదును ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ...గ్రామీణ ప్రాంతాలలో కనుమరుగువుతున్న పురాతన దేవాలయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో వెంకటేష్‌గుప్త, వెంకటయ్య పాల్గొన్నారు.

సీఐ వెంకటేశ్వర్లుకు అభినందనలు



వెంకటేశ్వర్లును అభినందిస్తున్న ఏసీపీ కుశాల్కర్

షాద్‌నగర్‌రూరల్: షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్న ఎస్‌ఐ వెంకటేశ్వర్లు సీఐగా పదోన్నతి పొందారు. గురువారం ఏసీపీ కుశాల్కర్ వెంకటేశ్వర్లుకు స్టార్ పెట్టి అభినందించారు. ఇటీవల 2009 బ్యాచ్‌కు చెందిన ఎస్‌ఐలకు ప్రభుత్వం సీఐలుగా పదోన్నతి కల్పించింది. 2009 బ్యాచ్‌కు చెందిన వెంకటేశ్వర్లు షాద్‌నగర్‌తో పాటు నందిగామ, చౌదరిగూడ పోలీస్‌స్టేషన్‌ల్లో ఎస్‌ఐగా విధులు నిర్వర్తించారు. అనంతరం వెంకటేశ్వర్లును ఏసీపీ కుశాల్కర్‌కు ప్రత్యేక ధన్యవాదాలను తెలియచేశారు.

వైద్య శిబిరాలకు అపూర్వ స్పందన

కొందుర్గు: పాలమూరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాలకు అపూర్వ స్పందన లభిస్తుంది. గురువారం జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని గుంజల్‌పహాడ్, ఎదిర, ముష్టిపల్లి గ్రామాల్లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో దాదాపు 1000 పైనే రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ఆరోగ్యపరమైన సేవలు అందించాలని ఈ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసు, ప్రదీప్, శ్యామ్ సుందర్ రెడ్డి, అశోక్, రమేష్, రాజు, నర్సింలు, చందు, నరేష్ పాల్గొన్నారు.

జూలై 3న దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ సభ

కురుమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సదానందం

షాబాద్: జూలై 3న చేవెళ్లలో జరగనున్న దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ సభను విజయవంతం చేయాలని కురుమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిష్టగొని సదానందం పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని స్టార్ గార్డెన్‌లో కురుమ సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కురుమ సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గ్రామాల్లో కురుమలు బలోపేతం కావాలని, చలో చేవెళ్ల దొడ్డికొమురయ్య విగ్రహావిష్కరణ సభను విజయవంతం చేయాలన్నారు. మండలం నుంచి అధిక సంఖ్యలో తరలిరావాలని సూచించారు. కార్యక్రమంలో షాబాద్ మండల అధ్యక్షుడు మద్దూరు పాండు, జిల్లా సహాయ కార్యదర్శి సూద యాదయ్య, ఉపాధ్యక్షుడు బండ కృష్ణ, నాయకులు సతీష్, కుమార్, మల్లేశ్, మహేందర్, యాదయ్య, రాజేందర్, సుదర్శన్ తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్

బక్రీద్‌ను పురస్కరించుకొని గురువారం మైనార్టీ సోదరులంతా దర్గాలు, మజీద్‌ల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లోని ఆయా గ్రామాల్లోని మైనార్టీ సోదరులు ఒక్కరి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. భక్తికి, త్యాగానికి బక్రీద్ ప్రతీకగా నిలుస్తోందని ముస్లిం పెద్దలు వివరించారు. –సాక్షి, నెట్‌వర్క్



షాబాద్: శుభాకాంక్షలు తెలుపుతున్న జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి తదితరులు



జిల్లేడ్ చౌదరిగూడలో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



మొయినాబాద్: బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు



షాద్‌నగర్: ఈద్గా వద్ద ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



కేశంపేట: ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



కొత్తూరు: శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



చేవెళ్ల: శుభాకాంక్షలు కాంగ్రెస్ నేత వసంతం, తదితరులు

రోడ్లతోనే గ్రామాల అభివృద్ధి

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

నందిగామ: రోడ్లతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని, రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని శ్రీనివాసులగూడలో స్థానిక సర్పంచ్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌డిఎఫ్ నిధులు రూ.1 కోటి 95 లక్షల వ్యయంతో నిర్మించనున్న బీటీరోడ్డు పనులకు ఎమ్మెల్యే గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు చేపట్టని ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ప్రస్తుతం నిర్మిస్తున్న రోడ్డు మజీద్ మామిడిపల్లి నుంచి శ్రీనివాసులగూడ మీదుగా ఈదులపల్లి వరకు వెళ్తుందని చెప్పారు. ఈ రోడ్డు ఏర్పాటుతో అనేక గ్రామాల ప్రజలు రాకపోకలు కొనసాగించేందుకు వీలు కల్గుతుందని వివరించారు. ఇప్పటికే షాద్‌నగర్ నుంచి కొత్తూరు వరకు నాలుగు వరుసల రహదారి నిర్మించామని, ఎస్‌బీపల్లి నుంచి కొత్తపేట వరకు బీటీ రోడ్లు ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గణేష్, సర్పంచులు జేకే నర్సింహా, వెంకట్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ అశోక్, మాజీ చైర్మన్ విఠల్, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పద్మారెడ్డి, నాయకులు తాంద్ర గోపాల్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

రోడ్డు పనులు పూర్తి చేయాలి

కొత్తూరు: పాత జాతీయ రహదారి నుంచి కొత్తూరు, కుమ్మరిగూడ మీదుగా అక్కివానిగూడ వరకు మంజూరైన రోడ్డు పనులను వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఫాతీమాపూర్, స్టేషన్‌తిమ్మాపూర్ గ్రామాల ప్రజలు కోరుతున్నారు. గత ఐదేళ్ల క్రితం ప్రారంభమైన ఈ రోడ్డు పనులను కాంట్రాక్టర్ కొంతమేర చేసినట్లు తెలిపారు. రోడ్డు పనులు పూర్తి చేయకపోవడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నరసింహగౌడ్ సేవలు మరువలేనివి

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



నరసింహగౌడ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

కేశంపేట: మాజీ ఎంపీపీ వర్కాల లక్ష్మమ్మ భర్త, షాద్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణగౌడ్ తండ్రి వర్కాల నరసింహగౌడ్ సేవలు మరువలేనివని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. మండలంలోని లింగంధనలో గురువారం నరసింహగౌడ్ దశదిన కర్మను కుటుంబ సభ్యులు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ నరసింహగౌడ్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు జమాల్‌ఖాన్, మాజీ జెడ్పీటీసీ పల్లె నర్సింగ్‌రావు, పీఏసీఎస్ డైరెక్టర్ మధుసూదన్‌గౌడ్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు భారీగా తరలివచ్చి నరసింహగౌడ్‌కు నివాళి అర్పించారు.

సీఐగా ప్రతాప్‌లింగం బాధ్యతల స్వీకరణ

షాద్‌నగర్ రూరల్: షాద్‌నగర్ పట్టణ నూతన సీఐగా ప్రతాప్‌లింగం బాధ్యతలను స్వీకరించారు. గురువారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో డీఐ భరత్‌కుమార్, ఎస్‌ఐలు విజయ్, దేవకి, సిబ్బంది పుష్పగుచ్ఛాన్ని అందజేసి స్వాగతం పలికారు. పట్టణ సీఐగా విధులు నిర్వర్తించిన నవీన్‌కుమార్ సైబరాబాద్ కమిషనరేట్ (క్రైం విభాగం)కు బదిలీ అయ్యారు. దీంతో రామచంద్రాపురం(ఆర్‌సీపురం) పోలీస్‌స్టేషన్‌లో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న ప్రతాప్‌లింగం బదిలీపై షాద్‌నగర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ప్రతాప్‌లింగం మాట్లాడుతూ.. శాంతిభద్రతలను కాపాడేందుకు నా వంతు కృషి చేస్తానని అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరు తమవంతు సహకారాన్ని అందించాలని కోరారు.

నవీన్‌కుమార్‌కు వీడ్కోలు

బదిలీపై వెళ్తున్న నవీన్‌కుమార్‌కు వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ ఆవరణలో నవీన్‌కుమార్‌ను భారీ గజమాలతో ఘనంగా సన్మానించిన పోలీసులు పూల వర్షం కురిపించి తమ అభిమానాన్ని చాటారు.



నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన ప్రతాప్ లింగంకు స్వాగతం పలుకుతున్న ఎస్‌ఐ విజయ్

ఘనంగా తొలి ఏకదాశి పూజలు

చేవెళ్ల: మండలకేంద్రంలోని లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో తొలి ఏకాదశి పూజలు ప్రత్యేకంగా జరిగాయి. గురువారం తొలి ఏకాదశి సందర్భంగా ఉదయం నుంచి ఆలయంలో భక్తుల సందడి కనిపించింది. ఏడాదిలో వచ్చే 24 ఏకదశుల్లో ఆషాడ శుక్ల ఏకాదశి తొలి ఏకాదశిగా భావిస్తుంటారు. పూర్వం ఈ తొలిఏకదాశి నుంచే కొత్త సంవత్సరంగా పరిగణించేవారిని అందుకే తొలి ఏకదాశి అంటే ప్రత్యేకత ఉండేదని చెబుతుంటారు. ఈరోజు విష్ణు పరమాత్మునికి అత్యంత ప్రీతికరమైన రోజుని పూజారులు తెలిపారు. తొలి ఏకాదశి సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

దేవాలయాల్లో ప్రత్యేక పూజలు

షాద్‌నగర్: తొలి ఏకాదశిని పురస్కరించుకొని గురువారం పట్టణంలోని పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం, సాయిబాబా దేవాలయం, శివమారుతీ గీతా అయ్యప్ప మందిరం, వాసవీ కన్యకాపరమేశ్వరి, చౌడమ్మగుట్ట హనుమాన్ దేవాలయం, మండలంలోని రామేశ్వరం, రంగధాములుస్వామి దేవాలయాలల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి నిర్వహించి ప్రత్యేక పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు, మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నట్‌రాజన్, ఒగ్గుకిషోర్ పాల్గొన్నారు.



చేవెళ్ల: ప్రత్యేక అలంకరణలో స్వామివారు



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు

దైవచింతన అలవర్చుకోవాలి

మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

నందిగామ: ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవర్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి అన్నారు. నందిగామ శివారులో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయంలో గురువారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అయన మాట్లాడుతూ.. ఎంతో పురాతన చరిత్ర కల్గిన అయ్యప్ప ఆలయాన్ని పునఃనిర్మాణం చేయడం ఎంతో అభినందించదగ్గ విషయమన్నారు. అయ్యప్ప ఆలయాన్ని నిర్మించేందుకు ఎంతో మంది దాతలు ముందుకు రావడం శుభపరిణామం అన్నారు. అనంతరం ప్రతాప్‌రెడ్డిని అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హరిజీవన్, సుదర్శన్‌గౌడ్, లక్ష్మయ్యయాదవ్, మాజీ సర్పంచ్ రాంరెడ్డి, నాయకులు శ్రీకాంత్‌గౌడ్, శివకుమార్, నర్సింహయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతాప్‌రెడ్డిని సన్మానిస్తున్న అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు

ఉద్యమ స్వరం మూగబోయింది



షాద్‌నగర్: సాయిచంద్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

ప్రముఖ గాయకుడు సాయిచంద్ హఠాన్మరణం తెలంగాణ సమాజానికి తీరని లోటు. చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు సాయిచంద్ భౌతికకాయాన్ని గురువారం సందర్శించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. తన ఆటపాటలతో తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర పునర్నిర్మాణంలో ఆయన గొప్ప పాత్ర పోషించి ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. –సాక్షి, నెట్‌వర్క్



షాబాద్: సాయిచంద్ అంతిమ యాత్రలో ఎమ్మెల్యే యాదయ్య, అవినాశ్‌రెడ్డి, తదితరులు



హిమాయత్‌నగర్ చౌరస్తాలో సాయిచంద్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే



నందిగామ: సాయి చంద్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ గణేశ్



కేశంపేట: సాయిచంద్ అంతిమయాత్రలో పాల్గొన్న విశాల

మైనింగ్ అక్రమాలపై నిగ్గు తేల్చండి?

- కేటాయించిన విస్తీర్ణం కంటే ఎక్కువ తవ్వకాలు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- పట్టించుకోని అధికారులు

కొత్తూరు: మైనింగ్ నిర్వాహకులకు కేటాయించిన విస్తీర్ణం కంటే ఎక్కువ మొత్తంలో తవ్వకాలు చేపడుతూ కోట్లలో ప్రభుత్వ ఆదాయాన్ని మైనింగ్ మాఫియా దోచుకుంటుంది. బ్లాస్టింగ్ సమయంలో కనీస నిబంధనలు పాటించకుండా పర్యావరణానికి తీరని హాని కల్గుజేస్తున్నారు. మైనింగ్, రెవెన్యూ అధికారులు స్పందించి అక్రమాలపై విచారణ చేపట్టాలని మండలంలోని సిద్ధాపూర్, ఇన్ముల్‌నర్వ, కొడిచర్ల గ్రామస్తులు కోరుతున్నారు. గతేడాది సిద్ధాపూర్‌లో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో సైతం బాధిత గ్రామస్తులు ఈ విషయమై సమగ్ర విచారణ జరపాలని జిల్లా అదనపు కలెక్టర్, పీసీబీ అధికారులకు విజ్ఞప్తి చేసినా ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేదు.

భూములు ఇలా..

కొత్తూరు మండలంలోని ఇన్ముల్‌నర్వ, సిద్ధాపూర్, ఎస్‌బీపల్లి, కొడిచర్ల గ్రామాల శివార్లలో సుమారు 700 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములు ఉన్నాయి. అందులో సిద్ధాపూర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 252లో 122 ఎకరాలు, 275లో 23.20, 278లో 66.20, 288లో 15.39, 361లో 142.06, 440లో 67.60 కొడిచర్లలో 198లో 89.20 ఎకరాల్లో పెద్ద పెద్ద గుట్టలు విస్తరించి ఉన్నాయి. వాటిలో సిద్ధాపూర్ పరిధిలోని సర్వే నంబర్లు 275, 278, 288లో సుమారు 12 హెక్టార్లలో నాలుగు స్టోన్ క్రషింగ్ యూనిట్లకు గతంలో మైనింగ్ శాఖ అధికారులు అనుమతులు జారీ చేశారు.అయితే, కేటాయించిన విస్తీర్ణం కంటే ఎక్కువగా తవ్వకాలు వ్యాపారులు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా మరికొంత మంది వ్యాపారులు తమకు రికార్డుల్లో కేటాయించిన సర్వే నంబర్లకు బదులు ఇతర సర్వే నంబర్లలో గుట్టలను తవ్వుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా మైనింగ్ వ్యాపారులు కొంతమంది అధికారులను మభ్యపెడుతూ ప్రభుత్వానికి పన్నుల రూపంలో రావాల్సిన రూ.కోట్లను దోచుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



సిద్ధాపూర్ శివార్లలో కొనసాగుతున్న స్టోన్‌క్రషర్లు

నిబంధనలు పాటించని వ్యాపారులు..

తవ్వకాలు, బ్లాస్టింగ్ సమయాల్లో మైనింగ్ నిర్వాహకులు కనీస నిబంధనలు పాటించడం లేదు. సుమారు వంద ఫీట్ల వరకు డ్రిల్లింగ్ చేసి బ్లాస్టింగ్‌లు చేస్తుండడంతో పెద్ద ప్రకంపనలు వస్తున్నట్లు సమీప గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. ప్రకంపనల కారణంగా వ్యవసాయ పొలాల్లోని బోర్లు లోపలే కూరుకుపోతున్నాయని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. పెద్ద పెద్ద రాళ్లు ఎగిరిపడుతుండడంతో వ్యవసాయ పనులు చేయడానికి భయాందోళన చెందుతున్నారు. స్టోన్‌క్రషింగ్ వల్ల విపరీతమైన దుమ్ము వెలువడి పంటలపై పడడంతో నాణ్యత, దిగుబడి తగ్గుతున్నట్లు వాపోతున్నారు. ముఖ్యంగా శ్వాసకోస వ్యాధుల బారిన పడుతున్నామని రైతులు, ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తవ్వకాల కారణంగా ఏర్పడిన భారీ గుంత

అక్రమాలపై సర్వే చేపట్టాలి



సిద్ధాపూర్, కొడిచర్ల శివార్లలోని ప్రభుత్వ భూముల్లో ఏర్పాటు చేసిన మైనింగ్ అక్రమాలపై సంబంధిత శాఖల అధికారులు వెంటనే సర్వేలు చేపట్టాలి. అక్రమాలు చేసినట్లు తేలితే వ్యాపారుల నుంచి ప్రభుత్వానికి రావాల్సిన నిధులను రికవరీ చేయాలి. అంతేకాకుండా నిబంధనలు పాటించని మైనింగ్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి. ఈ అంశంపై జెడ్పీ సమావేశంలో కూడా ప్రసంగించడం జరిగింది.

– ఎమ్మె శ్రీలత, జెడ్పీటీసీ, కొత్తూరు

బీజేపీ బలోపేతానికి కృషి

పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాష్

షాబాద్: తొమ్మిదేళ్ల పాలనలో ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికీ వివరిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంజర్ల ప్రకాష్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని చందనవెల్లిలో బూత్ నంబర్ 232, 233 బూత్ అధ్యక్షుడు నీరటి ఆంజనేయులు, పి.అనంతం ఆధ్వర్యంలో మహాసంకల్ప అభియాన్ ప్రచార కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రాష్ట్రంలో కేసీఆర్ అవినీతి, నియంత పాలన, ప్రజావ్యతిరేక విధానాలను వివరిస్తూ రాబోయే ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయాలని ప్రచారం నిర్వహించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పథకాలను తెలంగాణ ప్రజల దరి చేరకుండా బీఆర్‌ఎస్ ప్రభుత్వం అడ్డుకుంటోందన్నారు. వచ్చే ఎన్నికల్లో కారు టైర్లు పంక్చర్ కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేష్, బీజేపీ మండల అధ్యక్షుడు కిరణ్‌కుమార్, రాష్ట్ర స్వచ్ఛ భారత్ సెల్ కన్వీనర్ రాము, నాయకులు మాణెయ్య, కావలి వెంకటయ్య, రాంబాబుగౌడ్, కృష్ణయ్యగౌడ్, జగన్, శ్రీనివాస్, మల్లేష్, పెంటయ్య, రాంచంద్రయ్య, భిక్షపతి తదితరులున్నారు.



ఇంటింటికీ ప్రచారం నిర్వహిస్తున్న కంజర్ల ప్రకాష్ తదితరులు